క్లుప్తంగా

వడదెబ్బపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సదుం: వడదెబ్బ నివారణపై చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీషా పాలమంద ఎస్సీ కాలనీలో బుధవారం అవగాహన కల్పించారు. కూలీపనులకు వెళ్లేవారు ఉదయం 11 గంటల లోపు పనులు పూర్తి చేసుకోవాలని, ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. వడదెబ్బకు గురైతే తలనొప్పి, నీరసం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వేసవిలో ఎక్కువ నీరు తీసుకోవాలన్నారు. వడదెబ్బ బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించాలన్నారు. సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గంగవరం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు ఇటీవల ప్రపంచ టీబీ నిర్మూలన దినోత్సవం రోజున ఉన్నతాధికారుల నుంచి జిల్లా ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకోవడం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన్ను పీహెచ్‌సీలో వైద్యాధికారి లహరి, ఆరోగ్య సిబ్బంది శాలువతో సత్కరించారు. సేవలను కొనియాడారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల న్యాయవాదులు బుధవారం విధులను బుధవారం న్యాయవాదులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ దారుణహత్యను ఖండించారు. హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపారు.

29న ఉగాది వేడుకలు

వి.కోట: ఈ నెల 29న పట్టణంలోని రాగశ్రీ పాఠశాల ఆవరణలో విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు పసపల హరికృష్ణారెడ్డి, కార్యదర్శి రఘుపతి బుధవారం తెలిపారు. పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి సేవనం, కవి సమ్మేళనం నిర్వహిస్తామని, అలాగే ఉత్తమ కవులతో పాటు 10 మంది ఆదర్శ రైతులకు సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనదలచిన తెలుగు కవులు, కవయిత్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441911161, 8328642033 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్యలు రానివ్వద్దు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ కుమార్

శాంతిపురం: వేసవికాలం ప్రారంభం కావడంతో మండలవ్యాప్తంగా ఏ గ్రామంలో కూడా తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ఞ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. తాగునీటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించాలన్నారు. ఎక్కడైనా అవసరం వస్తే సత్వరం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కొళాయిలు వేసుకున్న వారికి నోటీసులు ఇచ్చి, వాటిని తొలగించాలని ఆదేశించారు.

వృద్ధురాలి మృతిపై విచారణ

చిత్తూరు అర్బన్: నగరంలో వృద్ధురాలి మృతిపై బుధవారం పోలీసులు విచారణ ప్రారంభించారు. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు నగరం అనుపల్లెకు చెందిన సుమతి(60) మంగళవారం ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు బుధవారం అంత్యక్రియలు పూర్తి చేసేందుకు యత్నించారు. అయితే వృద్ధురాలి మృతిపై అనుమానం ఉందని గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఖననం చేసే చివరి సమయంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

టమాట

ముంచునా.. తేల్చునా..!

- వేసవిలో భారీగా పెరిగిన సాగు
- భారీగా రైతన్నల పెట్టుబడులు
- ఇప్పుడు ధరలు తగ్గుదల
- కొత్త పంటలకైనా ధరలు దక్కేనో.. లేదో..?



నాటి నెలరోజులైన టమాట

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ఎక్కువగా సాగయ్యే పంటల్లో టమాట ప్రధానమైంది. ప్రస్తుత వేసవి సీజన్‌లో పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట ఎక్కువగా సాగవుతోంది. మార్చి చివరి వరకూ ఈ ప్రాంతంలో దీని సాగుకు అనుకూలం. దీనికి తోడు ఈ పర్యాయం కొత్త హైబ్రిడ్ వంగడాల సాగు ఎక్కువైంది. హైబ్రిడ్ రకాల సాగు కోసం ఎకరాకు రెండున్నర లక్షలు పెట్టుబడి పెట్టి ధర లేకపోతే అప్పులపాలవక తప్పదనే శంక రైతులను పీడిస్తోంది. దీంతో ఈసారి టమాట రైతులను ముంచుతుందా.. బయట పడేస్తుందా? అనేది లాటరీగా మారింది. హైబ్రిడ్ రకం సాగుకు ఎకరాకు

రూ.2.50లక్షల పెట్టుబడి

హైబ్రిడ్ రకాల టమాట సాగుకు ఎకరాకు 7వేల మొక్కలు రూపాయి ధరతో రూ. 7వేలు, దుక్కి దున్నకం, సత్తువ కోసం ఎరువులకు రూ.50వేలు, స్టిక్‌లు, మల్చింగ్ పేపర్‌కు రూ.లక్ష, ఆపై క్రిమి సంహారక మందులు, ఎరువులకు రూ.50 వేల చొప్పున, ఇతర ఖర్చులు మొత్తం కలిపి రూ.2.50లక్షలు వ్యయం అవుతోంది. పంట బాగా వస్తే ఎకరాకు 2వేల బాక్సుల దిగుబడి వస్తుంది. బాక్సు ధర రూ.400గా ఉంటే రూ. 8లక్షలు, రూ.300గా ఉంటే రూ.6లక్షలు రైతుకు వస్తుంది. దీంతో ఖర్చులు పోను మిగిలేది మాత్రమే ఆదాయం. కానీ ఇప్పుడున్న ధర బాక్సు రూ.80తో రూ.1.60లక్షలు దక్కితే పంటకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కదు. కానీ వచ్చే వేసవి సీజన్‌లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ధరలుంటాయనే ఆశతో రైతులు ఈసారి భారీగా సాగు చేశారు.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు
సాధారణ సాగు ఈ సీజన్‌లో 5వేల హెక్టార్లు
ఈ పర్యాయం సాగు 7వేల హెక్టార్లు
నాటి వారం రోజులైన పంట 4వేల హెక్టార్లు
నాటి నెలరోజులైన పంట 1,500 హెక్టార్లు
పూతదశలో ఉన్న పంట 1000 హెక్టార్లు
కోత దశలో ఉన్న పంట 500 హెక్టార్లు



చీలంపల్లె వద్ద వారం క్రితం నాటిన టమాట



కర్రలు కట్టేందుకు సిద్ధమైన టమాట

కొత్త వంగడాలతో పంట ఉత్పత్తి పెరుగుతుంది



పాత రకాలు కాకుండా కొత్త వంగడాల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్‌ఆర్) బెంగళూరు, ద ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఆఫ్ నేషనల్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌తోపాటు ప్రైవేటు సీడ్స్ కంపెనీలు సైతం ఎక్కువగా దిగుబడినిచ్చే కొత్త వంగడాల సీడ్స్ అందుబాటులో ఉంచుతున్నాయి. వీటి సాగుకు పెట్టుబడి ఎక్కువైనా దిగుబడి ఎక్కువగా ఉంటుంది. కోత దశలో ధరలు బాగుంటే రైతులకు ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుంది.

–కోటేశ్వరరావు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటబుల్స్ సైంటిస్ట్, కుప్పం

రైతులకు గొర్రె దాటు పద్ధతి మంచిది కాదు



ఎప్పుడో వేసవిలో ఓసారి టమాట బాక్సు వెయ్యి దాటి కొందరు రైతులు కోటీశ్వరులయ్యారు. దీన్ని చూసి ఇక్కడి రైతులు ఈసారి భారీగా టమాట సాగు చేస్తున్నారు. ఏదైనా పంట సప్లయ్ ఎక్కువైతే డిమాండ్ తగ్గుతుందనే సూత్రాన్ని వీరు మరచిపోతున్నారు. పక్కరైతు టమాట నాటాడు.. మనమూ నాటుదాం.. అంటూ గొర్రె దాటు విధానంలో పోతే ధర వస్తుందో రాదో..! వారి అదృష్టమనే చెప్పాలి. –ఉమాపతి, రైతు సంఘ నేత, పలమనేరు

నోటీస్ బోర్డు

ఎంపీపీ ఎన్నిక

సదుం: స్థానిక మండల పరిషత్‌లో ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానానికి గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. దీనికోసం పలమనేరు ఆర్డీఓ భవానీని ప్రత్యేక అధికారిగా నియమించారని చెప్పారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబరు తప్పనిసరిగా హాజరు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి కోరారు.

నేడు న్యాయవాదుల సంఘ ఎన్నికలు

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదుల సంఘ ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని పోస్టులు ఏకగ్రీవమైనప్పటికీ అధ్యక్ష ఎన్నికకు మాత్రం ప్రస్తుత అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, ఎల్‌వీ.రమణ పోటీ పడుతున్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం రేపు

సదుం: ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. 2023–24లో దాదాపు రూ.7 కోట్లతో 18 పంచాయతీలలో చేసిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందం ఈనెల 13 నుంచి పరిశీలించినట్లు ఆయన చెప్పారు. నివేదిక అంశాలను సమావేశంలో వెల్లడిస్తామన్నారు.

బోరు పనులకు భూమి పూజ



బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని కొంగాటం పంచాయతీ కారకుంట కొత్తూరులో దాహార్తి సమస్యను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిష్కరించారు. తాగునీటి సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. జెడ్పీ నిధులు మంజూరు చేయించి కొత్తగా బోరు వేయించారు. బుధవారం బోరు డ్రిల్లింగ్ పనులకు భూమి పూజ చేసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఎంపీటీసీ కమల్, నాయకులు రవిరెడ్డి, వెంకటరామప్ప,గోపిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి

మండలంలోని హనుమంతనగర్‌కు చెందిన చంద్రారాజు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: శ్రీ విశ్వావసు నామ సంవత్సర నూతన తెలుగు క్యాలెండర్లను మండల ప్రబోధ సేవా సమితి సభ్యులు బుధవారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా తోటకనుమలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. అనంతరం ఆ సమితి మండల కమిటీ అధ్యక్షుడు అశోక్ బాబు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. క్యాలెండర్లలో భగవద్గీత వచనములు, తెలుగు పండుగుల విశిష్టతతో పాటు కాలసూచికలను అందరికీ అర్థమయ్యే భాషలో ముద్రించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు విజయ్, హరి, హేమతేజ, గౌతమ్, ఉదయ్ పాల్గొన్నారు.

'నవోదయ'కు ఎంపిక



పుంగనూరులో నవోదయకు ఎంపికైన విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని జ్ఞానాంబిక హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు 'నవోదయ'కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి తెలిపారు. తమ స్కూల్‌కు చెందిన చెందిన చిద్విలాస్, సమృద్ధి, తేజేష్, దేవానంద, కిరణ్ , సనాతన్, యోగసాయి నవోదయకు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. అలాగే పట్టణంలోని శ్రీకృష్ణారెడ్డి చైతన్య చిల్డ్రన్స్ అకాడమికి చెందిన విద్యార్థులు జాగృతి, శృతిలయ, విష్ణు, మౌనిక, రాఖేష్, అనుదీప్‌సాయి, మనేశ్వర్, మనస్విని, పూర్ణచంద్ర, జీవనసాయి, చైత్ర, మధుశ్రీ, శ్రావ్య సైతం నవోదయకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



సమావేశంలో మాజీఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మైనారిటీ అభ్యున్నతి, ప్రత్యేక రిజర్వేషన్లు తమ ప్రభుత్వ పాలనలోనే సాధ్యమయ్యాయని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏకే గార్డెన్స్‌లో ముస్లింలకు వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం, ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వైఎస్సార్ పాలనలోనే మైనారిటీలకు మేలు కలిగిందని చెప్పారు. పవిత్ర రంజాన్ పండుగను సుఖసంతోషాలతో ముస్లింలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, నాయకులు హరి, అమరనాథ్, శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్



రొంపిచెర్లలో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ఆరు మసీదుల్లో ప్రార్థనలు చేసే ముస్లింలకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలలోని ముస్లింలు హాజరయ్యారు. బుధవారం ఒక ఫంక్షన్ హాల్‌లో బిర్యానీ తయారు చేయించి, ప్యాకెట్లలో దీనిని పంపిణీ చేశారు. ప్రతి ఏటా రంజాన్ పండుగ పురస్కరించుకుని ఎమ్మెల్యే ఇఫ్తార్ ఇవ్వడం తమకు ఆనందంగా ఉందని ముస్లింలు తమ ఆనందాన్ని నాయకులతో పంచుకున్నారు. పంపిణీ ఏర్పాట్లను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, విజయశేఖర్, సలీం బాషా, ఎల్.మహబుబ్‌బాషా, కరీముల్లా, అల్లాబక్ష్, బుడ్డాన్ సాహెబ్, ఖలీల్, సైఫుల్లాఖాన్, ఐడియా కాలేషా, ఎస్. మహబూబ్‌బాషా, రాజాసాహెబ్, మంజూర్, ముజీబ్, అబుబక్కర్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు కూటమి పనే!



చంద్రకుమార్

పలమనేరు: రాష్ట్రంలో క్రైస్తవులపై సాగుతున్న దాడులకు రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలే కారణమని, వీరు పక్కా ప్లాన్‌తో క్రైస్తవులపై దాడులు చేస్తున్నారని జిల్లా మాల జేఏసీ నాయకులు చంద్రకుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటికైనా కూటమి చేస్తున్న మోసాలను గమనించి ఎదుర్కోకపోతే క్రైస్తవులకు భవిష్యత్తు ఉండదన్నారు. ఒక వ్యూహం ప్రకారం మైనారిటీలు, క్రైస్తవులపై చేస్తున్న దాడులు, దుశ్చర్యలను గమనించి వీటినిఎదుర్కొనే దిశగా సమయాత్తం కావాలని పిలుపునిచ్చారు.

ఏపీ పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి



పలమనేరు: ఏపీ పాలిసెట్–2025కు టెన్త్ విద్యార్థులు ఏప్రిల్ 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెహరా శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 30న ఉంటుందని, ఎంట్రన్స్ రాసిననూ ఒకవేళ సీటు రానిపక్షంలో అన్ని కౌన్సెలింగ్‌లు అయ్యాక స్పాట్ సెలెక్షన్లలో సీట్లు పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే విరాళం



సదుం: మసీదుల నిర్వాహకులతో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి



కల్లూరులో ఇఫ్తార్ విందుకు ముస్లిం పెద్దలకు విరాళం అందజేస్తున్న నాయకులు

సదుం: రంజాన్ మాసం పురస్కరించుకుని మండలంలోని 15 మసీదులలో ఇఫ్తార్ విందు ఏర్పాటుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.1.95 లక్షల విరాళం అందజేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక మూడు మసీదులలో విందు కోసం రూ. 75 వేలు అందించినట్లు ఆయన చెప్పారు. నగదును మసీదు నిర్వాహకులకు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.

పులిచెర్ల మండలంలో రూ.2.77లక్షలు..

పులిచెర్ల(కల్లూరు): ఇఫ్తార్ విందుకు గాను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పులిచెర్ల మండలంలోని 22 మసీదులకు రూ.2.77 లక్షల విరాళాన్ని ఆయా మసీదులకు నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, హేమసుందరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మునీర్‌ఖాన్, జాఫర్ హుస్సేన్, కలాం, నాగరాజప్రసాద్, నిరంజన్‌రెడ్డి, సైదుల్లా, రమణారెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజలను మోసం చేశారు

- అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని హామీకి తూట్లు
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలకు షాక్ ఇస్తున్న కూటమి ప్రభుత్వం




ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

పలమనేరు: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలను పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేసి కరెంట్ షాక్ ఇస్తున్నారని, దీనికి నిరసనగా ఈనెల 28న పలమనేరులో ధర్నా చేయనున్నట్టు సీపీఎం నాయకులు తెలిపారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడారు. గతంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి రాగానే వాటిని ఎలా పనికట్టుకుని బిగిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి ఉప్పుడు జనాన్ని మోసం చేసిందెవరని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ధర్నా చేయనున్నామని, ప్రజలు కూడా పాల్గొని చంద్రబాబును తీరును ఎండగట్టాలని కోరారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ సంతకం లేకనే పనులు మంజూరు!

- అధికారుల తీరుపై ఆగ్రహం



సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ మోహన్

ఐరాల: మినిట్స్ బుక్‌లో తన సంతకం లేకుండానే రూ.33 లక్షల పనులు ఎలా ఆమోదిస్తారని అధికారులను ఎంపీపీ మోహన్ నిలదీశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల ప్రతిపాదనకు ఎంపీటీసీ సభ్యుల ఆమోదం లేకుండా అమలు చేయడం ఏంటి అని? మండిపడ్డారు. గత నెల ఎంపీడీఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన పరికరాలకు నిధులు అవసరమని తన వద్ద సంతకం పెట్టించుకుని, అందులోనే ఈ రూ.33 లక్షల పనులను కలపడం మోసపూరిత ఆలోచనే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కనీసం గౌరవం ఇవ్వడం లేదని, ఇష్టానుసారంగా నిధులు ఖర్చుపెడుతున్నారని, ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపించారు. మినిట్స్ బుక్‌లో తన సంతకం లేకుండా ఆమోదించిన పనులను వెంటనే రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఎంపీడీఓ భువనేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ స్పందిస్తూ జెడ్పీ సీఈఓ రవి కుమార్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన మండల సమావేశానికి తనకు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, ఎంపీటీసీ సభ్యులు మమత, లత పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో క్రైస్తవుల నిరసన ర్యాలీ



చిత్తూరులో గాంధీ విగ్రహం కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేసి, నిందితుల్ని అరెస్టు చేయాలని చిత్తూరు క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు పాస్టర్ మృతికి బుధవారం రాత్రి చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మోకాళ్లపై కూర్చుని ప్రార్థన చేశారు. మతపెద్దలు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఈ ఘటన క్రైస్తవుల్ని ఎంతో ఆందోళనకు గురి చేసిందన్నారు. రెవరెండ్ డాలివన్ క్రిస్టిదాస్, ప్రబోధకులు, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.